**Eenadu**

# త్వరలో 500మంది ఎంసీహెచ్ సిబ్బంది నియామకం: మంత్రి కామినేని

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో 500 మంది ఎంసీహెచ్ సిబ్బంది (గైనకాలజిస్ట్, పిడియాట్రిక్ ఇతర స్పెషలిస్ట్‌లు) పోస్టులను నియమించటానికి ఉద్యోగ ప్రకటన ఇస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలోని గుమ్మఘట్ట ప్రాంతంలో బుధవారం ముఖ్యమంత్రి పర్యటించనున్నందున మంగళవారం మంత్రి సభాస్థలిని, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సేద్యపునీటికుంటలు, జలఫిరంగులు, జనరేటర్‌లను పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రయోగం చేయటం ఇదే మొదటిసారి కాబట్టి కొంతవరకు ఇబ్బందులు కలగవచ్చని భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ వర్షాలు రాకపోయినా సేద్యపు నీటికుంటలు, జలఫిరంగుల సాయంతో వందశాతం వేరుసెనగకు రక్షక తడులిచ్చి కాపాడతామన్నారు. ఆరోగ్యశాఖ గురించి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 84 పీహెచ్‌సీలు ప్రారంభిస్తున్నామని, ప్రతీ పీహెచ్‌సీకి వైద్యులతో కలిసి మొత్తం 11 మంది సిబ్బందిని నియమించుకోవటానికి ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌టీఆర్ వైద్యసేవలో కుటుంబానికి ఇంతకుముందు రూ.2 లక్షల వైద్యఖర్చులు ఇచ్చేవారని ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.2.50 లక్షలకు పెంచినట్టు వివరించారు. మొత్తం 1044 వ్యాధులకు ఎన్‌టీఆర్ వైద్యసేవ అందుబాటులో ఉంటుందన్నారు.